# నిజాయితీ

-వి. వెంకటేశ్వర్లు

కవిత సన్నగా, చలాకీగా ఉంటుంది. తెల్లని తెలుపు. ఆ బ్రహ్మదేవుడు ఒక్కో స్త్రీకి ఒక్కో ప్రత్యేకతను సృష్టిస్తాడ నుకుంటా.

ఆయన తను చేసే స్త్రీ సృష్టిలోని ఏదో ఒక భాగాన్ని శ్రద్ధ తీసుకుని మరీ తయారు చేస్తాడేమో! కాబట్టి ప్రతి స్త్రీలోని ఏదో ఒక అందం మగాడి గుండెలను మెత్తగా హత్తుకుంటుంది.

మరికవితలోని అందమంతా ఎక్కడ ఉందంటే ఆమె నడుము వంపులో... యస్ ఆమె నడుము వంపు చూడముచ్చటగా ఉంటుంది.

ఆ నడుం మీద ఒక్కసారయినా చెయ్యివేసి నిమరాలనిపిస్తుంది. నాలాగే కవితది కూడా క్లోజ్‌గా మూవ్ అయ్యే స్వభావం.

నేను ఆఫీసులో జాయినింగ్ రిపోర్టు ఇచ్చి వచ్చి నా సీట్లో కూర్చున్న వెంటనే ఆమె నా కుర్చీ దగ్గరకు వచ్చి పలకరిఛింది.

నా పక్కనే ఉన్న సీట్లో కూర్చుంటూ "రాజమండ్రి నుంచి ట్రాన్స్‌ఫరయి వచ్చారా?" అంటూ ప్రశ్నించింది.

"అవునండీ" జవాబిచ్చాను నేను.

"మీ పేరు?"

"వెంకట్"

"నా పేరు కవిత."



ఆ తర్వాత మిగతా అందరూ నా సీటు దగ్గరకు రావడం మొదలు పెట్టారు. నన్ను పలకరించసాగారు. అందర్ని పరిచయం చేసుకున్నాను. పరిచయాలయ్యాక ఆ మధ్యాహ్నం మోహన్ నన్ను అడిగారు "మీరు హోటల్ లో దిగారా?" అని.

"అవునండీ! రూమ్ దొరికే వరకూ హోటల్‌లో ఉండాలికదా!?"

మోహన్ ఒక నిమిషం మౌనంగా ఉండి తర్వాత చెప్పాడు.

"మీకు అభ్యంతరం లేకపోతే మీరు నాగదిలో చేరొచ్చు. నేనెలాగూ ఒంటరి వాడినే. మీరొస్తే కలసి ఉందాం."

మంచి రూమ్‌లో చేరేందుకు అభ్యంతరం ఏముం టుంది?

ఆనందంగా అంగీకరించాను. ఆరోజు సాయంత్రమే హోటల్ రూమ్‌లోని లగేజీ తీసుకొచ్చి కొత్త రూమ్‌లో పడేశాను.

మోహన్ ఆఫీసులో ముభావంగా ఉన్నారూమ్‌లో మాత్రం సరదాగా ఉండేవాడు.

జోక్‌లు కట్‌చేస్తూ జాలీగా ఉండేవాడు. అంతేకాదు అతడు కాస్త శృంగార పురుషుడు కూడా.

గదినిండా దేశ, విదేశీ సుందరీమణుల అర్ధనగ్న చిత్రాలు అంటించబడి ఉండేవి.

సూట్‌కేస్ అడుగున 'ప్లే బాయ్' లాంటి విదేశీ మేగజైన్స్ 'ముద్దుకో గుద్దు'లాంటి కథా పుస్తకాలు ఉండేవి.

గదిలో చేరిన మొదటిరోజే మోహన్ ఆఫీసులోని అందరి వివరాలూ నాకు చెప్పాడు.

"ఆఫీసర్ విశ్వనాథం మంచివాడు. రామ్‌కు పేకాట పిచ్చి ఉంది. జగదీష్‌కు రోజూ గొంతులో మందు పడా ల్సిందే. రాజు చాలా మంచివాడు. ఏ వ్యసనమూ లేని వాడు. జయరామ్ ఎప్పుడూ అప్పుల వేటలో ఉంటాడు. ఒకసారి అప్పిస్తే తిరిగిఇచ్చే సమస్య ఉండదు. రూపిణికి, జయలక్ష్మికి పెళ్ళయి పోయింది. సో! నో కామెంట్. లత ఎత్తు పళ్ళతో, నల్లగా ఉంటుంది. అటువంటి వారితో మనకేమిటి పని? ఇక మిగిలింది - కవిత?"

ఆసక్తిగా ముందుకు వంగానునేను.కవితను గురిం చిన వివరాలు తెలుసుకోవాలని నా మనసు ఆరాటపడు తోంది.

అయితే అప్పుడే మోహన్ అన్నమాట నా మనసుని మొద్దుబారేలా చేసింది.

"కవితను నేనోసారి అనుభవించాను గురూ"

ఎందుకో తెలియదు. నా గుండెలోతుల్లో బాధ సుళ్ళు తిరిగింది. వెంటనే నన్ను నేను ప్రశ్నించుకున్నాను.

కాస్త పరిచయం మాత్రమే ఉన్న ఆ కవిత కేరక్టర్ మంచిది కాదని తెలిస్తే నా మనసు ఎందుకు బాధపడటం?

ఏమో! ఆ ప్రశ్నకు జవాబు తోచలేదు. కాని బాధ పడవద్దని నా మనసుకు నేనే సర్ది చెప్పుకున్నాను. అయినా మోహన్ మాటలు నిజమో కాదో? అదే అడిగాను.

"మోహన్‌గారూ? మీరు... మీరు చెప్పేది నిజమా?"

"అబద్ధం చెప్పాల్సిన అవసరం నాకేం ఉంది."

అని ఆగి తర్వాత అన్నాడు. "అయినా కవితలాంటి వారిని లైన్‌లోనికి తెచ్చుకోవడం పెద్ద కష్టమేం కాదు గురూ!"

అతడి అభిప్రాయంలో నిజం ఎంతో నాకు తెలియదు గానీ అతడు చెప్పిన మాటలన్నీ నన్ను బాగా డిజప్పాయింట్ చేశాయి.

అందంగా, అమాయికంగా, పసిపాపలా తేడాలెరుగక ఆప్యాయంగా మాట్లాడే కవిత కేరక్టర్ ఇంత చీపా? నమ్మలేకపోతున్నాను.

కాని... కాని మోహన్‌కు ఆమె మీద అపవాదు వేయ వలసిన అవసరం ఏముంది? అందుకే అనుకున్నాను... నిజమే అయ్యుండొచ్చని.

చివరగా అడిగాను "మోహన్ గారూ! అయితే ఇప్పటికి మీ ఇద్దరి మధ్యా...!"

"నో నో! ఎప్పుడూ ఒకక్వాలిటీ నాకిష్టం ఉండదు. అందుకే ఆమె గురించికూడా ఆలోచించననేనిప్పుడు."

★ ★ ★

నేను ఆ ఆఫీసులో చేరి అప్పటికి నెల రోజులయింది.

ఈ నెలరోజుల కాలంలో నేను ఆఫీసు స్టాఫ్ మధ్య 'మంచివాడు' అనే గుర్తింపు తెచ్చుకున్నాను.

ఆఫీసర్ దగ్గర నుండీ అటెండర్ వరకూ. కొలీగ్స్‌తో సహా నాకు 'మంచివాడు' అనే సర్టిఫికెట్ ఇచ్చేశారు.

రూపిణి, లత, జయలక్ష్మిలు నాతో చక్కగా మాట్లాడేవారు. కవిత ఆఫీసులో అందరికంటే ఎక్కువగా నాతోనే మాట్లాడేది.

మరెంతో చనువుగా ప్రవర్తించేది.

ఆమె సాన్నిహిత్యం నాకు ఆనందంగానే అనిపించినా, మోహన్ మాటలు జ్ఞప్తికి వచ్చిన క్షణం మాత్రం మనసులో ఏదో భావం ముల్లులా గుచ్చుకునేది.

అయినా కవిత అలాంటిది అంటే మాత్రం నమ్మబుద్ధికాదు. అప్పటికే మోహన్ మాటలు పూర్తిగా నమ్మలేని నేను రాజు నోసారి అడిగాను. "రాజూ మన టైపిస్టు కవిత గురించి మోహన్ ఏదో అన్నాడు అది... అది నిజమేనా?"

రాజు భుజాలు విగరేశాడు.

"ఏమో! నిజం ఎంత మాత్రమో నాకు తెలియదు. మోహన్, జయరామ్ లిద్దరూ ఆమె అలాంటిదేనంటారు. అయినా... నిప్పులేనిదే పొగరాదు కదా!" అని ఆగి తర్వాత నా వంక చూసి నవ్వు తూ అన్నాడు. "ఇంతకీ ఈ విషయాలు నీకెందుకుబ్రదర్! కవిత కోసం నువ్వుకూడా ట్రై చేస్తున్నావా ఏమిటి?"


"నో నో! అలాంటిదేమీ లేదు." కంగారుగా అన్నాను నేను.

బట్ నా ఇంట్రెస్ట్ అంతటితో ఆగలేదు. ఈసారి జయరామ్ దగ్గరా ఆ ప్రస్తావన తీసుకువచ్చాను.

నేను అడిగిన ప్రశ్నకు జవాబుగా అతను "కవిత అలాంటిదే గురూ! నాకు ఒక ఛాన్స్ ఇచ్చింది. కాని అనివార్యకారణాలవల్ల ఆ రోజు ప్రోగ్రాం మిస్ అయింది. సమయం సందర్భం కలిసి రాలేదు."

కవితకేరక్టర్ గురించి నేనో నిర్ణయానికి రాక తప్పలేదు.

## పరిచయం




పేరు : కురుమ వలగొండ వెంకటేశ్వర్లు
విద్యార్హతలు: ఎం.కామ్., హెచ్.డి.సి.ఎమ్.
పుట్టిన తేది : 15-03-1969
ఉద్యోగం : సహాయ అకౌంటెంట్

అడ్రస్:
వి.వెంకటేశ్వర్లు
ఇ.నెం.4-49-15(8-81)
అంబేద్కర్ నగర్,
చింతల్ (హెచ్.ఎమ్.టి)
హైదరాబాద్ - 503 854.

కవిత కేరక్టర్ మంచిదికాదు. ఆ భావం నాకు చాలా బాధ కలిగించింది. కవితకు మెల్లగా దూరం కాసాగాను. ఒక విధంగా ఆమెను తప్పించుకుని తిరగసాగాను. ఆమె నా టేబుల్ దగ్గరకు వస్తే బిజీ నటించేవాడిని. లంచ్ టైమ్‌లో ఆమెకు దూరంగా వెళ్ళి కూర్చునే వాడిని.

కవిత నాలోని మార్పును గుర్తించిందో లేదో తెలియదు. బహుశా ఆమె గుర్తించలేదనుకుంటా. అందువల్లే కాబోలు యథాప్రకారం చనువుగా పాపపుణ్యాలెరుగని పసిపాపలా మాట్లాడేది.

యస్! కవితను చూస్తే పసిపాపలానే అనిపిస్తుంది. అదిగో... ఆ ఒక్క తప్పే వెనుక లేకపోతే కవిత పసిపాపలానే ఉంటుంది.

'లోకం తెలియని పాపవనీ ఎట్లా నీకు చెప్పేది' అని పాట పాడాలనిపిస్తుంది. కాలం ఇలాగే సాగిపోయి ఉంటే ఆమె మీద నా అభిప్రాయం అలాగే ఉండిపోయి ఉండేది. కొద్ది రోజుల తర్వాత నేనెక్కడికో ట్రాన్స్‌ఫరయి ఉండే వాడిని.

కాని - కొన్ని అనూహ్య సంఘటనలు మనిషి జీవితాన్ని అనుకోని మలుపులు తిప్పుతాయి. లేకపోతే నేను అసహ్యించుకునే కవితను ఇష్టపడి నేను పెళ్ళి చేసుకోవడం ఏమిటి?

ఆ రోజు అలా జరగబట్టే నా జీవితంలో ఓ చక్కని మలుపు సాధ్యమయింది.

ఆ రోజు... టేబుల్ మీదున్న ఫైల్స్ కట్టిపైకి లేచాను. నేను ఆఫీసు ఆవరణలో నుండి ఇవతలకు వచ్చాను.

మోహన్ సెలవుపెట్టి ఊరెళ్ళాడు. అతడి స్కూటర్ నా దగ్గరే ఉంది. స్కూటర్‌ని పార్కింగ్ ప్లేస్‌లో నుండి బయటకు తీశాను.

ఆఫీసులోని అందరూ అప్పటికే ఇళ్ళకు వెళ్ళిపోయారు. కొద్దిగా పెండింగ్ వర్క్ ఉండి కంప్లీట్ చేయడంలో నాక్కాస్త ఆలస్యమయింది.

స్కూటర్‌ని స్టార్టు చేస్తూ ఆకాశం వంక చూశాను. ఆకాశంలో మబ్బులు దట్టంగా కమ్ముకుని ఉన్నాయి.

ఈ క్షణానో - మరు క్షణానో వర్షం వచ్చేలా ఉంది. వర్షానికంటే ముందుగానే రూమ్‌కి చేరుకోవాలనుకున్నాను. స్కూటర్‌ని స్టార్ట్ చేసి వేగంగా ముందుకు దూకించాను.

సరస్వతి సెంటర్ నుండి జగదాంబ సెంటర్ చేరింది స్కూటర్. మా గది అప్సర దగ్గర్లోనే. స్కూటర్‌ని ముందుకు పోనిస్తూ యథాలాపంగా బస్టాప్ వంక చూశాను.

కవిత బస్టాప్‌లో నిలబడి బస్సుకోసం ఎదురు చూస్తోంది. ఆమె ఇల్లు విద్యానగర్ కాలనీలో అని నాకు తెలుసు. పాపం! బస్సు వచ్చినట్టులేదు.

ఆమెను చూసీ చూడనట్టుగా వెళ్ళిపోవాలనిపించింది వెంటనే.



## ఉత్తరం

"ఏయ్ చిట్టీ.. ఏం చేస్తున్నావ్ మూలకూర్చుని పాఠం వినకుండా."

"ఉత్తరం రాస్తున్నా టీచర్."

"అబద్ధాలు చెప్పకు. నీ కసలు రాయటమే రాదు."

"రాదనుకోండి. మరి మా తమ్ముడికి చదవటం రాదుగా."

-కె.రాధ(మల్లారం)
మం:మలహర్-505 184
కరీంనగర్ - జిల్లా.

కాని... వర్షం ఉధృతంగా వచ్చేలా ఉంది. వర్షం వస్తే ఆమె తడిసి ముద్దకావడం ఖాయం - మనసులోని ఏ మారుమూలో దాగిన అభిమానం స్కూటర్‌ని ఆ వైపుకు మళ్ళించింది.

నేను తన ముందు ఆగడంతో ఆమె చిన్నగా నవ్వింది. "రండి! వర్షం వచ్చేలా ఉంది. ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను" పిలిచాను.

ఆమె రెండడుగులు ముందుకు వేసి "నేను మీకన్నా పైకి వెళ్ళాలికదా! మీకు ఇబ్బందేమో" చెప్పింది.

"ఫర్వాలేదు! వర్షం మొదలయితే మీరు ఇల్లు చేరుకోవడం కష్టం అవుతుంది. వర్షానికన్నా ముందు మిమ్మల్ని ఇల్లు చేరుస్తాను రండి."

ఆమె కూడా ఆకాశంలో మబ్బుల వంక చూసింది. ఇక మారు మాట్లాడకుండా స్కూటర్ వెనుక కూర్చుంది. స్కూటర్ ముందుకు పోనిచ్చాను నేను.

'తానొకటి తలిస్తే, దేవుడొకటి తలుస్తాడన్నట్టు' సరిగ్గా అప్పుడే ఒక వర్షపు చినుకు నా మీద పడింది. పాతిక గజాల దూరం వెళ్ళింది స్కూటర్.

ఆకాశం తన రోదనను అప్పటివరకు బిగపట్టుకుని ఉందేమో. ఒక్కసారిగా ఉద్వేగంగా రోదించసాగింది. ఆరోదన తాలూకు వేదన వర్షపు నీరులా మారి విశాఖ నగరాన్ని తడపసాగింది.

వర్షం మొదలయిన మొదటి పది క్షణాలలోనే మేమిద్దరం ముద్దయి పోయాం "మై గాడ్! వర్షం అప్పుడే మొదలయిందే" కంగారుగా అన్నాను నేను.

"ఈ వర్షంలో మనం మీ ఇంటివరకూ వెళ్ళగలమా?" ప్రశ్నించాను స్కూటర్‌ని ఎక్కడ ఆపాలా అని చుట్టూ చూస్తూ అప్పటికే మేము అప్సరా హోటల్ దగ్గరగా వచ్చేశాం.

"మీ రూమ్ దగ్గరేకదా! పోనీ మీ రూమ్‌కి పోనివ్వండి" చెప్పింది కవిత.

"వెరీ గుడ్" అనుకుని వేగంగా రూమ్‌వైపు పోనిచ్చాను. అప్పటికి నా మనసులో ఎలాంటి దురాలోచన లేదు. వర్షం నుండి తప్పించుకోవాలన్న ఆత్రుత మాత్రమే ఉంది.

రూమ్ ముందు స్కూటర్‌ని ఆపి లాక్‌చేసి లోపలకు ఆహ్వానిస్తూ పిలిచాను "లోపలకు రండి"

నా ఆహ్వానం అవసరం లేకుండానే ఆమె అప్పటికే లోపలికి వచ్చేసింది.

అప్పటికే ఇద్దరం తడిసి ముద్దయి ఉన్నాం. తల తుడుచుకునేందుకు టవల్ అందుకోవాలని పక్కకు తిరిగాను.

అప్పుడు... అప్పుడు కనిపించాయి గోడమీది ఆ నగ్న చిత్రాలు. గుండె క్షణం ఆగి తిరిగి కొట్టుకోసాగింది. మొట్ట మొదటిసారిగా ఏదో గిల్టీ ఫీలింగ్ నా మనసులో ప్రవేశించినది.

ఆమె కూడా తల తిప్పి అటుగా చూసింది.

అనువుగాని చోటుకు రాబడ్డామన్న ఫీలింగ్ ఇద్దరిలోనూ కదలాడింది కాని తప్పనిసరి పరిస్థితి.

మౌనంగా ముందుకు నడిచి హేంగర్‌కున్న రెండు టవల్స్‌తీసి ఒకటి ఆమెకిచ్చాను. 'తల తుడుచుకోండి' ఎప్పుడూ గబగబా మాట్లాడే కవిత ఆ క్షణం మూగిలా ఉండి పోయింది.

నిశ్శబ్దంగా చేతిలోని టవల్ అందుకొంది. జడకు వేసి ఉన్న క్లిప్ తీసి టవల్‌తో తల తుడుచుకో సాగింది.

నేను కుర్చీలో కూర్చుని తల తుడుచుకుంటూ ఓరగా ఆమె వంక చూశాను.

నల్లని మేఘంలా వత్తయిన జుట్టు ఆమె భుజాల మీద పరుచుకుని ఉంది. శరీరమంతా తడిసి ముద్దయి ఉండడంతో బట్టలు వంటికి అతుక్కుపోయి శరీరంలోని ప్రతి వంపూ స్పష్టంగా కనిపిస్తోంది.

మా చుట్టూ రెచ్చగొట్టే శృంగార చిత్రాలు కోరికలను ఉధృత పరిచే వర్షపు హోరు... చలిగాలి వెచ్చదనం కోరుతోంది.

తల తుడుచుకున్న తర్వాత పైకి లేచి గదిలోకి ఓ మూలకు నడిచాను. వేసుకున్న బట్టలు విప్పి ఓ పక్కకు విసిరేసి, హేంగర్స్‌కున్న లుంగీతీసి చుట్టుకున్నాను. బెడ్‌మీద కూర్చుని ఆమె వంక చూశాను. అప్పటి వరకు నా వంకే చూస్తున్న కవిత చప్పున తల తిప్పుకుంది.

"ఇలా వచ్చి కూర్చోండి" కుర్చీ చూపిస్తూ చెప్పాను. ఆ క్షణం ఎందుకనో నా గొంతు నాకే కొత్తగా వినిపించింది.

కవిత అవైపు తిరిగి చీర కుచ్చెళ్ళు మడిచి పిండుకుంది. తర్వాత పైటనువిప్పి పిండింది.

టవల్‌తో శరీరమంతా ఒకసారి తుడుచుకుంది. మెల్లగా నడిచి వచ్చి కుర్చీలో కూర్చుంది.

చాలా కాలంగా మేమిద్దరం చనువుగా మాట్లాడు కుంటున్నాం. అప్పుడు మా మధ్య ఎలాంటి అనీజీనెస్ లేదు.

కాని ఇప్పుడు కొత్తగా ఏదో బిడియం. ఒక్కసారిగా మేమిద్దరం అపరిచితులమయిపోయినట్లు. మాటలు మందగించి పోయాయి.

ఇద్దరి మధ్య ఎంతో దూరం పెరిగినట్లనిపిస్తుంది. మాట్లాడుకోవాలంటే టాపిక్ దొరకని పరిస్థితి.

ఏమీ తోచడం లేదు. పోనీ ఏదయినా పుస్తకం చదువుకుందామని పక్కనే ఉన్న పుస్తకం అందుకున్నాను. మధ్యలో పేజీ తిప్పాను.

"ఆమె అతడిని మరింత గట్టిగా హత్తుకుంది. అతడు ఆమె ఉలిక్కిపడి పుస్తకం ముఖచిత్రం క్రిందనున్న పేరు చూశాను. 'బరి తెగించిన పిల్ల' కంగారుగా పుస్తకం మూలకు విసిరేశాను. అది ఆమె గమనించింది.

అగ్నిపర్వతం పెటిల్లున పగిలినట్లు శరీరమంతా సెగలుకమ్ముకున్నాయి. కనులముందు పుస్తకంలోని వాక్యాలు.

చెవుల్లో మోహన్ అన్న మాటలు. కవితలాంటి స్త్రీని లైన్‌లోకి తెచ్చుకోవడం పెద్ద కష్టమేం కాదు గురూ! మగవారితో చనువుగా మాట్లాడే...

నాకు ఆమె మీద కోరికలేదు. కాని అలాంటి వాతావరణంలో మనసు తప్పు చేయమని తొందరపెట్టడం సహజమేనేమో!

నాలోని విచక్షణ పూర్తిగా నశించిపోయింది. ఇప్పుడు జాగ్రత్త? చేయాల్సింది నేనేనేమో అన్న ఆలోచన.

మెల్లగా బెడ్‌మీది నుండి పైకి లేచాను. ఆమె కుర్చీ దగ్గరగా నడిచాను. కుర్చీ మీద కుడిచేతిని ఉంచి ఎడమ చేతిని మెల్లగా భుజాల మీదకు జరిపాను.

కవిత తన్మయత్వంతో కన్నులు మూసుకోలేదు. ఉలిక్కిపడి లేచి నిలబడింది. నా కళ్ళల్లోకి సూటిగా చూసింది.

అదోలా నవ్వబోయాను నేను. నవ్వు రాలేదు. ఆమె తీక్షణమయిన చూపులు నన్ను క్షణకాలం కంగారు పడేలా చేశాయి.

అయినా ధైర్యం తెచ్చుకుని, సిగ్గు విడిచి అడిగాను. "ప్లీజ్ కవితా!... ఒక్కసారి..."

ఆమె చిన్నగా, గణికినట్టుగా అంది. "మీరు మంచివారనీ, అందరిలాంటి వారు కాదనీ అనుకున్నాను నేను."

నేను కాస్త ధైర్యం తెచ్చుకున్నాను.

"నేను మంచి వాడినే... బట్ ఇలాంటి పరిస్థితులలో నేనయినా, మోహన్ అయినా, జయరామ్ అయినా ఎవరయినా ఒకేలా ప్రవర్తిస్తారు."

కవిత నా వంక వింతగా చూసింది. "ఈ సమయంలో వారి ప్రస్తావన ఎందుకు?"

ఆమె అలా ఎందుకు బెట్టు చేస్తోందో నాకర్థం కాలేదు.

'వారు' చెప్పినమాటలు నిజమయితే ఈసరికే కవిత నాకౌగిలిలో వాలిపోయి ఉండాలి.

అలా జరగలేదంటే... ఆలోచించ వలసింది. కాని నాలో 'అహం' పెరిగింది. 'ఆ' ఇద్దరికన్నా నేనెందులో తక్కువ? ఇంకా ముసుగులో గుద్దులాట నాకిష్టం లేకపోయింది.

అందుకే అన్నాను. "మోహన్ నీ గురించి నాకంతా చెప్పేశాడు."

"ఏం చెప్పాడు?" ఆమె గొంతులో ఆశ్చర్యం..

"తాను నిన్ను అనుభవించానని."

ఆమె అంత వేగంగా కదలగలదని గానీ ఆమె చేతికి అంత బలం ఉందనిగానీ నేనూహించలేదు. తెలుసుకునే టప్పటికి ఆలస్యమయింది. ఆమె చెయ్యి నా చెంపను తాకింది. బిత్తరపోయాను.

కవిత కూడా పిచ్చిపట్టిన దానిలా అరిచింది.

హోల్డ్ యువర్ టంగ్ ఎవరు... ఎవరు నన్ను అనుభవించింది?! మోహన్, జయరామ్‌లా? నా చెప్పు దెబ్బలు తిన్నవారు కసితో అనే మాటలివి. చనువుగా ఉన్నానని చెయ్యిపట్టుకుంటే చెప్పుతో కొట్టాను. నీ మీదున్న గౌరవంతో ఇంతటితో వదిలాను."

నా ముందున్న ప్రపంచం గిర్రున తిరుగుతున్నట్టని పించింది. ఎదుటివారి వ్యక్తిత్వాలను కించపరిచే వ్యక్తుల మాటలు విని నేను అనవసరంగా చెంపదెబ్బ తిన్నానేమో? కానీ ఏమూలో చెంపదెబ్బ తిన్నా నాలో ఏదో ఆనందం!! పసిపాప కవితలో ఏ తప్పూ లేదు. ఆమె... ఆమె నిజాయితీ నా మదిని పులకింప చేసింది.

ఆ తరువాత జరగవలసినవి జరిగిపోసాగాయి. అమ్మా నాన్నా నేను కవిత అనే అమ్మాయిని పెళ్ళి చేసుకుంటా నంటే సంతోషంగా అంగీకరించారు.

నేను కవిత పెళ్ళి చేసుకోబోతున్నాం అన్న వార్త ఆఫీసులో స్టాఫ్‌ను ఆశ్చర్యపోయేలా చేసింది.

ఆఫీసులోని ప్రతి ఒక్కరి నోట ఒకటే మాట 'కవిత, వెంకట్‌ని వలలో వేసుకుంది. పాపం అమాయకుడు... అయినా ఆమెను గురించి పూర్తిగా తెలిసికూడా...' ఆ మాటలకు నేను నవ్వు కున్నాను.

ఆ విషయం విన్న మోహన్ నా దగ్గరకు వచ్చాడు.

"వెంకట్! నేను విన్నది నిజమేనా? నువ్వు కవితను పెళ్ళి చేసుకోబోతున్నావా?"

"అవును"

"ఆమె ఎలాంటిదో తెలిసికూడా..."

"షటప్" అరిచాను.

"నిప్పులేనిదే పొగ రాదంటారు పెద్దలు కాని 'నిప్పు లేకుండానే పొగ', 'నిజం లేకుండానే అపవాదు' వేయ గలిగిన వ్యక్తులున్న సమాజం మనది. అందులో నువ్వూ ఒక భాగమే ఇది నిజం కాదా?"

మోహన్ తలదించుకున్నాడు.

'ఆత్మవంచన చేసు కుంటూ లోకం కోసం జీవిస్తారు కొందరు! ఆత్మతృప్తి కోసం లోకాన్ని ఎదిరిస్తారు మరి కొందరు!!'

నేనూ కవితా ఆ రెండో కోవకు చెందిన వాళ్ళం అవుతాము.


వి. వెంకటేశ్వర్లు
హెచ్.నం. 4-49-15(8-81),
అంబేద్కర్ నగర్, చింతల్,
హైదరాబాదు - 500 854.


★

